తెలుగు దినపత్రిక

# డైలీ రిపోర్ట్

DAILY REPORT


## ఇంజనీరింగ్ విద్యార్థినిపై అత్యాచారం



ఇబ్రహీంపట్నం, జనవరి 16 (డైలీ రిపోర్ట్ ): హైదరాబాద్ శివారులో ఓ ఇంజనీరింగ్ విద్యార్థిని అత్యాచారానికి గురైంది. రాత్రి వేళ ప్రైవేటు గర్ల్స్ హాస్టల్‌లోకి ప్రవేశించిన యువకుడు.. గదిలో ఒంటరిగా ఉన్న యువతిపై అఘాయిత్యానికి ఒడిగట్టాడు. రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నం పోలీసు స్టేషన్ పరిధిలోని ఓ ప్రైవేటు గర్ల్స్ హాస్టల్‌లో బుధవారం అర్ధరాత్రి ఈదారుణం జరిగింది. మంగల్‌పల్లిలోని ఓ ఇంజనీరింగ్ కళాశాలలో బీటెక్ మొదటి సంవత్సరం చదువుతున్న ఓ విద్యార్థిని సమీపంలోని (మంగల్‌పల్లి గేట్ దగ్గర) ఓ ప్రైవేట్ హాస్టల్‌లో ఉంటోంది.

సంపుటి 1 సంచిక :163 ఎడిటర్: దాస శ్రీనివాస్ ప్రచురణ: హైదరాబాద్ శుక్రవారం 17-01-2025 వెల: 5/రూ.

# సైఫ్ అలీఖాన్‌కు కత్తిపోట్లు



**ముంబై, జనవరి 16 (డైలీ రిపోర్ట్):** బాలీవుడ్ నటుడు సైఫ్ అలీఖాన్‌పై ఓ గుర్తుతెలియని దుండగుడు విచక్షణారహితంగా కత్తితో దాడి చేశాడు. ఆరు కత్తిపోట్లకు గురైన సైఫ్.. ప్రస్తుతం లీలావతి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. ఆయనకు అత్యవసర శస్త్రచికిత్సలు చేశామని, ప్రాణాపాయం ఏమీ లేదని, రెండ్రోజుల్లో నాన్–ఐసీయూ విభాగానికి మారుస్తామని వైద్యులు తెలిపారు. దొంగతనానికి వచ్చిన దుండగుడి ప్రయత్నాన్ని సైఫ్ అడ్డుకోవడంతో జరిగిన పెనుగులాటలో కత్తితో దాడి చేసినట్లు ఆ ఇంటి పనిమనిషి చెబుతోంది. ఆమెకు కూడా స్వల్ప గాయాలయ్యాయి. సైఫ్ అలీఖాన్ ఇంటి పనిమనిషి ఫిర్యాదు, పోలీసుల కథనం ప్రకారం.. గురుగ్రామ్‌లోని పటౌడీ సంస్థాన వారసుడు, బాలీవుడ్ నటుడు సైఫ్ అలీఖాన్ ముంబైలోని బాంద్రాలో 12 అంతస్తులు ఉన్న సత్‌గురు శరణ్ అపార్ట్‌మెంట్‌లో.. చివరి నాలుగు అంతస్తుల్లో నివసిస్తున్నారు. బుధవారం రాత్రి ఆయన భార్య, బాలీవుడ్ నటి కరీనాకపూర్, కుమారులు జహంగీర్ అలీఖాన్, తైమూర్ అలీఖాన్‌తో నిద్రకు ఉపక్రమించారు. వీరు ఉంటున్న అపార్ట్‌మెంట్‌కు కట్టుదిట్టమైన భద్రత ఉంటుంది.



అయితే.. రాత్రి 2 గంటల సమయంలో ఓ దుండగుడు అగ్నిప్రమాదాలు జరిగినప్పుడు కిందకు దిగేందుకు ఉపకరించే ఎమర్జెన్సీ మార్గం నుంచి సైఫ్ ఇంట్లోకి ప్రవేశించాడు. ఆ మార్గం సైఫ్ కుమారుడు జహంగీర్ గదికి అనుసంధానమై ఉంటుంది. జహంగీర్ తన తల్లిదండ్రుల వద్దే ఉండడం.. ఆ గదిలో అలికిడి రావడంతో పనిమనిషి నిద్రలేచి, అక్కడికి వెళ్లింది. జహంగీర్ గదిలో దుండగుడు నక్కి ఉండడంతో.. ''దొంగ.. దొంగ..'' అంటూ గట్టిగా కేకలు వేసింది. దాంతో నిద్ర లేచిన సైఫ్.. ఆ గదికి చేరుకున్నాడు. అప్పటికే ఆ దుండుగు పనిమనిషిని గట్టిగా పట్టుకుని, మెడపై కత్తి పెట్టి సైఫ్‌ను బెదిరించాడు. ''రూ. కోటిన్నర ఇస్తేనే ఆమెను వదులుతాను'' అంటూ హెచ్చరించాడు. దీంతో సైఫ్ దుండగుడితో తలపడ్డారు. ఈ క్రమంలో పెనుగులాట జరిగింది. తేరుకున్న దుండగుడు కత్తితో సైఫ్‌పై విచక్షణారహితంగా దాడి చేశాడు. ఈ అలికిడితో కరీనా, ఇద్దరు పిల్లలు, మరో పనిమనిషి అక్కడికి వచ్చేసరికి దుండగుడు వచ్చిన మార్గంలోనే పరారవ్వగా.. సైఫ్ రక్తమోడుతూ కనిపించారు. సైఫ్ వెన్నెముక, మెడ భాగంలో లోతుగా కత్తిపోట్లు కాగా.. చేతిపై, భుజంపై మరో నాలుగు గాయాలయ్యాయి. కుటుంబ సభ్యులు వెంటనే సైఫ్‌ను లీలావతి ఆస్పత్రికి తరలించారు.

## సైఫ్ సేఫ్

తీవ్ర గాయాలపాలైన సైఫ్ అలీఖాన్‌కు లీలావతి ఆస్పత్రి వైద్యులు డాక్టర్ నితిన్ డాంగే(న్యూరో సర్జన్), డాక్టర్ లీనా జైన్(కాస్మెటిక్ సర్జన్), డాక్టర్ నిషా గాంధీ(అనస్థీషియాలజిస్టు) రెండున్నర గంటల పాటు శ్రమించి, శస్త్రచికిత్స చేశారు. 2.5 అంగుళాల పొడవున్న కత్తి ముక్కను సైఫ్ వెన్నెముఖ నుంచి తొలగించామని వైద్యులు పేర్కొన్నారు. ''తెల్లవారుజామున 3 గంటల సమయంలో సైఫ్‌ను ఆస్పత్రికి తీసుకువచ్చారు. ప్రస్తుతం ఆయన ప్రాణాపాయం నుంచి బయటపడ్డారు. ఆయన ఆరోగ్యం నిలకడగా ఉంది. రెండ్రోజుల్లో కోలుకుంటారు. ఆ తర్వాత ఆయనను నాన్–ఐసీయూ వార్డుకు తరలిస్తాం'' అని లీలావతి ఆస్పత్రి సీవోవో డాక్టర్ నీరజ్ వెల్లడించారు. వెన్నెముక గాయాన్ని సరిచేసి, లీకైన ఫ్లూయిడ్లను సరిచేశామన్నారు. చేతికి, మెడకు ప్లాస్టిక్ సర్జరీలు చేశామని తెలిపారు. కాగా.. ఆస్పత్రి వద్ద సైఫ్, కరీనా టీమ్‌లు మీడియాతో మాట్లాడాయి. ఈ దాడి విషయంలో మీడియా సంయమనం పాటించాలని కోరాయి. సైఫ్ పరిస్థితిని ఎప్పటికప్పుడు తెలియజేస్తామన్నాయి.